క్లుప్తంగా

11న బల్దియా కార్యాలయం ఎదుట ధర్నా

వరంగల్ అర్బన్ : గ్రేటర్ వరంగల్ ఔట్ సోర్సింగ్ కార్మికుల సమస్యలు పరిష్కరించాలని ఈనెల 11న ప్రధాన కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహిస్తున్నట్లు టీఎంఆర్‌పీఎస్, ఐసీ టీయు నాయకులు తెలిపారు. సోమవారం హన్మకొండలోని పలు డివిజన్‌లలో ధర్నాకు సంబంధించిన కరపత్రాలను కార్మికులకు పంపిణీ చేశారు. అనంతరం గ్రీవెన్స్ సెల్ వినతి పత్రాన్ని సమర్పించారు. కార్యక్రమంలో నాయకులు బొట్ల బిక్షపతి, మున్నంగి రఘు, వేల్పుల ధర్మరాజు, టి.ఉప్పలయ్య, మహేష్, రాష్ట్ర కమిటీ సభ్యులు వై.బాబు, కోస రాజేష్, పాల్గొన్నారు.

కృష్ణాష్టమికి ఆహ్వానం

వరంగల్: త్రైత సిద్ధాంత ప్రబోధ సేవా సమితి ఆధ్వర్యంలో హనుమకొండలో జరిగే శ్రీకృష్ణ జన్మాష్టమి వేడుకల ఆహ్వాన పత్రికను వరంగల్ తూర్పు ఎమ్మెల్యే నన్నపనేని నరేందర్‌కు కృష్ణం వందే జగద్గురుమ్ నిర్వాహకులు సోమవారం అందజేశారు. ఈ సందర్భంగా నిర్వాహకులు మాట్లాడుతూ ప్రబోధానంద యోగీశ్వరుల దివ్య ఆశీస్సులతో సెప్టెంబర్ 6న శ్రీకృష్ణ జన్మాష్టమి వేడుకలు హనుమకొండ వెంకటేశ్వరకాలనీలో జరిగే ఊరేగింపులో ఎమ్మెల్యే పాల్గొనేందుకు అంగీకరించారని తెలి పారు.

నకిలీపత్రాలు సమర్పించే వారిపై చర్య తీసుకోవాలి



విద్యారణ్యపురి: హనుమకొండ జిల్లాలో ప్రస్తుతం నిర్వహిస్తున్న బదిలీలు, పదోన్నతుల కౌన్సెలింగ్ ప్రక్రియను సజావుగా నిర్వహించాలని నకిలీ ధ్రువపత్రాలను సమర్పించే వారిపై చర్యలు తీసుకోవాలని తెలంగాణా రాష్ట్ర ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్ (టీఎస్‌యూటీఎఫ్) రాష్ట్ర కార్యదర్శి సోమశేఖర్ ఇతర బాధ్యులు సోమవారం డీఈఓ ఎండి అబ్దుల్ హైని కలిసి వినతిపత్రంను సమర్పించారు. డీఈఓను కలిసినవారిలో టీఎస్‌యూటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు సదాశివరెడ్డి, జిల్లా జనరల్ సెక్రటరీ రాజు, జిల్లాకార్యదర్శి సీఎస్ఆర్ మల్లిక్ తదితరులు పాల్గొన్నారు.

శ్రావణమాస పూజలు

కాశిబుగ్గ : స్థానిక కాశీవిశ్వేశ్వరాలయంలో శ్రావణమాసం మూడో సోమవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు.కాశీవిశ్వేశ్వరునికి, ఆలయంలోని సహస్ర లింగానికి 9 కిలోల నెయ్యి, 18 కిలోల తేనెతో అభిషేకం చేశారు. మాజీ కార్పొరేటర్ బయ్యా స్వామి, పోషాలు, శ్రీనివాస్, వేముల నాగరాజు, రమాదేవి, రోజా, మణెమ్మ, రాణి తదితరులు పాల్గొన్నారు.

ఇందిరానగర్ అభివృద్ధి కమిటీ

హన్మకొండ : హనుమకొండలోని ఇందిరానగర్ అభివృద్ధి కమిటీ నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. సోమవారం ఇందిరానగర్‌లో అభివృద్ధి కమిటీ సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో నూతన కమిటీని ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా దొంగరి శ్రీనివాస్, ఉపాధ్యక్షులుగా పూరెల్లి రవికిరణ్ గౌడ్, నెల్లుట్ల శివప్రసాద్, దేవులపల్లి శ్యాంప్రసాద్ భార్గవ్, మల్లారెడ్డి, బానోతు బాలు నాయక్, ఎం.ప్రభాకర్, ప్రధాన కార్యదర్శిగా తేళ్ల కిశోర్, కోశాధికారిగా కార్తీక్ ఎన్నికయ్యారు.

బీసీ డిక్లరేషన్ ప్రకటించాలి

హన్మకొండ: స్పష్టమైన అంశాలతో కాంగ్రెస్ బీసీ డిక్లరేషన్‌ను ప్రకటించాలని బీసీ జేఏసీ రాష్ట్ర చైర్మన్ డాక్టర్ తిరునహరి శేషు కోరారు. సోమవారం హైదరాబాద్ గాంధీభవన్‌లో ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ వర్కింగ్ ప్రెసిడెంట్ మహేష్‌కుమార్‌గౌడ్‌ను కలిశారు. బీసీ కు లాలకు చెందిన కార్పొరేషన్లు, ఫెడరేషన్ల బలో పేతం, వృత్తుల పరిరక్షణకు ప్రత్యేక బ్యాంకు ఏర్పాటు, బీసీ విద్యార్థుల ఫీజు రీయింబర్స్‌మెంట్, రిజర్వేషన్ వంటి 9 అంశాలపై తిరునహరి శేషు నివేదిక అందజేసి బీసీ డిక్లరేషన్‌లో చేర్చాలని మహేష్ కుమార్ గౌడ్‌ను కోరారు. బీసీ నాయకులు రమేష్, లక్ష్మీనారాయణ పాల్గొన్నారు.

'నారాయణ స్కూల్‌పై చర్య తీసుకోవాలి'

హన్మకొండ అర్బన్ : ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధంగా నడుస్తున్న నగరంలోని నక్కలగుట్టలోని నారాయణ కార్పొరేట్ స్కూల్‌పై చర్యలు తీసుకోవాలని డీవైఎఫ్ఐ జిల్లా కార్యదర్శి డి.తిరుపతి, సహాయ కార్యదర్శి ఓర్సు చిరంజీవి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సోమవారం వారు జిల్లా అదనపు కలెక్టర్ సిహెచ్ మహేందర్‌జీకి వినతి పత్రం అందజేశారు.

కోటను సందర్శించిన సీఐ

ఖిలా వరంగల్: చారిత్రక ప్రసిద్ధి చెందిన తూర్పు, మధ్య, పడమర కోటలను సోమవారం తన సిబ్బందితో కలిసి మిల్స్‌కాలనీ ఇన్‌స్పెక్టర్ టి.సురేష్ సందర్శించారు. ఏకశిల చిల్డ్రన్ పార్కు, పర్యాటకులు వచ్చే రహదారులు, రాతి, మట్టి కోట పరిసరాలను క్షుణ్ణంగా పరిశీలించారు. రాతి కోట చుట్టూ నిర్జీవ ప్రదేశాలు, సీసీ రోడ్డుపై దృష్టి సారించేలా, విందుల పేరుతో మద్యం సేవిస్తూ ఆకతాయిలు తిష్టవేసే ఏరియాలపై ఆరా తీశారు. శిల్ప కళా వైభవాన్ని పర్యాటకులు వీక్షించే ప్రదేశాలను కోట గైడ్ రవియాదవ్‌ను అడిగి తెలుసుకున్నారు.

బీఆర్ఎస్, బీజేపీ రెండూ ఒక్కటే

- ఆ రెండు పార్టీలను చిత్తుగా ఓడించాలి
- సీపీఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు తక్కళ్లపల్లి శ్రీనివాసరావు



సమావేశంలో మాట్లాడుతున్న సీపీఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు శ్రీనివాస రావు

ఖిలావరంగల్: కేంద్రం, రాష్ట్రంలోని బీజేపీ, బీఆర్ఎస్ పార్టీలు రెండూ ఒక్కటేనని, ఆ పార్టీ నాయకులు పరస్పరం విమర్శించుకుంటున్నారని, రానున్న ఎన్నికల్లో ఆ పార్టీలను చిత్తుగా ఓడించాలని సీపీఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు తక్కళ్లపల్లి శ్రీనివాస రావు పిలుపునిచ్చారు. సోమవారం వరంగల్ శివనగర్‌లోని సీపీఐ జిల్లా కార్యాలయం తమ్మెర భవనంలో దండు లక్ష్మణ్ అధ్యక్షతన జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. రాష్ట్రంలో బీజేపీకి ఎవరూ ఓటు వేసే పరిస్థితి లేదన్నారు. బీఆర్ఎస్, బీజేపీ, ఎంఐఎం పార్టీలు కలిసే పనిచేస్తాయని, ఆపార్టీల భాగస్వామ్యం రాష్ట్రానికి, దేశానికి ప్రమాదకరమని అన్నారు. ఈనెల 8న అధిక ధరలకు వ్యతిరేకంగా జిల్లా వ్యాప్తంగా అన్ని మండల కేంద్రాల్లో ధర్నాలు నిర్వహించాలని నిర్ణయించినట్లు తెలిపారు. సమావేశంలో సీపీఐ జిల్లా కార్యదర్శి మేకల రవి, సహాయ కార్యదర్శి షేక్ బాష్మియా, పనాస ప్రసాద్, పంజాల రమేష్, రమేష్ రవీందర్, గన్నారపు రమేష్, చంద్రకళ, మునీశ్వరుడు , వీరగోని శంకరయ్య, ఎలేందర్, బద్రి, తదితరులు పాల్గొన్నారు.

ఎన్నికల హామీలు నెరవేర్చాలి



వినతిపత్రం ఇస్తున్న ఏఐకేఎఫ్ నాయకులు

హన్మకొండ అర్బన్ : తెలంగాణ రాష్ట్రం ఏర్పడి తొమ్మిదేళ్లు అవుతున్నా గత ఎన్నికల్లో ఇచ్చిన హామీలను అమలు చేయడంలో రాష్ట్ర ప్రభుత్వం విఫలమైందని అఖిల భారత రైతు సమాఖ్య (ఏఐకేఎఫ్) జిల్లా కార్యదర్శి ఎస్‌రెడ్డి హంసరెడ్డి అన్నారు. రాష్ట్ర ప్రభుత్వ వైఫల్యాలపై అఖిల భారత రైతు సమాఖ్య, ఆల్ ఇండియా సెంట్రల్ ట్రేడ్ యూనియన్, అఖిల భారత ప్రజాతంత్ర యువజన సమాఖ్య, అఖిల భారత ప్రజాతంత్ర మహిళా సమాఖ్య రాష్ట్ర కమిటీల పిలుపుమేరకు సోమవారం జిల్లా అదనపు కలెక్టర్ మహేందర్‌జీ కి వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో అఖిలభారత ప్రజాతంత్ర యువజన సమైక్య జిల్లా అధ్యక్షుడు నీల రవీందర్, కార్మిక రంగం జిల్లా కన్వీనర్ మొగిలి శ్రీనివాస్‌రావు తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధి పనులు ప్రారంభం

కాజీపేట రూరల్ : కాజీపేట జంక్షన్‌లో రైల్వే అధికారులు అమృత్ భారత్ అభివృద్ధి పనులను ప్రారంభించారు. కేంద్రప్రభుత్వం కాజీపేట జంక్షన్‌ను రూ.35 కోట్ల వ్యయంతో అమృత్ భారత్ స్టేషన్ స్కీంకు ఎంపిక చేసి శంకుస్థాపన చేసిన విషయం తెలిసిందే. ఈ మేరకు అభివృద్ధి పనుల్లో భాగంగా కాజీపేట జంక్షన్‌లో అభివృద్ధి పనులను ప్రారంభించి చేస్తున్నట్లు సోమవారం రైల్వే అధికారులు తెలిపారు. జంక్షన్ ముందు గల సర్క్యులేటింగ్ ఏరియాలో గార్డెనింగ్‌ల గ్రిల్స్‌లను తొలగించి నేల మట్టం చేశారు. ఇంకా స్టేషన్ ముందు, చుట్టు పక్కల కార్యాలయాలను తొలగించి విశాలమైన సర్క్యులేటింగ్ ఏరియాను ఏర్పాటు చేసి కాజీపేట చౌరస్తా నుంచి రైల్వే స్టేషన్‌కు వచ్చేందుకు మార్గం, రైల్వే స్టేషన్ నుంచి బయటి కాజీపేట చౌరస్తా మెయిన్ రోడ్‌కు వెళ్లేందుకు మార్గాన్ని ఏర్పాటు చేసి ప్రయాణికులకు కావల్సిన సదుపాయాలు, సౌకర్యాలతో అమృత్ భారత్ స్టేషన్‌లో పనులు చేపట్టినట్లు రైల్వే అధికారులు తెలిపారు. ఫిబ్రవరి 2024 సంవత్సరం నాటికి పూర్తి చేసి ప్రయాణికులకు అందుబాటులోకి తీసుకరానున్నట్లు తెలిపారు.

పిచ్చిమొక్కల తొలగింపు

ఖిలా వరంగల్ : మెట్ల బావి పునరుద్ధరణలో భాగంగా సోమవారం కాకతీయుల కాలం నాటి మెట్ల బావి (రాణి రుద్రమాదేవి స్నానాల బావి) ప్రాంగణంలో ఏపుగా పెరిగిన పిచ్చి మొక్కలు, గార్డెనింగ్ పూర్తిగా తొలగించారు. సాంకేతిక నిపుణులు సూచనల మేరకు స్థానిక కార్పొరేటర్ దిడ్డి కుమారస్వామి పర్యవేక్షణలో పనులు శరవేగంగా జరుగుతున్నాయి. బావిని మరోసారి సాంకేతిక నిపుణులు సందర్శించి, వారు రూపొందించిన ప్రణాళిక ప్రకారం శిల్పకళా ఉట్టి పడేలా తిరిగి అభివృద్ధి పనులు ప్రారంభమవుతాయని కార్పొరేటర్ తెలిపారు. నగరపాలక సంస్థ అధికారులు పాల్గొన్నారు.

వరంగల్‌లో 'అపూర్వ' సమ్మేళనం



గురువులను సన్మానించిన పూర్వ విద్యార్థులు

వరంగల్ చౌరస్తా : బాల్యమిత్రుల సరదా కబుర్లు..చిన్న నాటి చిలిపి చేష్టలు..పాఠశాలలో అల్లరిని గుర్తు చేసుకుంటూ ఆహ్లాదకర వాతావరణంలో అట్టహాసంగా 27 సంవత్సరాల వేడుకలను జరుపుకున్నారు పూర్వవిద్యార్థులు. వరంగల్ గిర్మాజీపేట రాజేంద్ర కన్వెంట్ హైస్కూల్లో 1995–1996 బ్యాచ్ పదో తరగతి విద్యార్థులు ఆత్మీయ సమ్మేళనం హన్మకొండలోని సుప్రభ హోటల్‌లో ఆదివారం రాత్రి జరిగింది. అప్పటి ఉపాధ్యాయులు, బాల్యమిత్రులను చూసి చిన్న నాటి మధుర జ్ఞాపకాలను గుర్తుచేసుకున్నారు. గురువులకు జ్ఞాపికలను అందజేసి ఘనంగా సన్మానించారు. ఉపాధ్యాయులు మాట్లాడుతూ తల్లిదండ్రులను గౌరవించాలన్నారు. కార్యక్రమంలో మల్లూరు కృష్ణమూర్తి, అజ్మీర్, మురళీ, ప్రదీప్ కుమార్, డాక్టర్ మోహన్‌సింగ్, ప్రవీణ్, నవీన్, అనిల్, ప్రవీణ్, వంశీ మోహన్, గఫార్, సుధీర్, కృష్ణ, సరిత, దేవి, శైలజ, శ్రీదేవి, శ్రీ వాణి, అరుంధతి, సంధ్య, స్వప్న, పల్లవి పాల్గొన్నారు.

బీఆర్ఎస్‌లో అరాచకాలు భరించలేక కాంగ్రెస్‌లోకి..



సమావేశంలో పాల్గొన్న కొండా మురళీ

వరంగల్: తెలంగాణ రాష్ట్రంలో బీఆర్ఎస్ అవలంభిస్తున్న అరాచకాలు, దోపిడీలను భరించలేక పలువురు కాంగ్రెస్ పార్టీలోకి వస్తున్నారని మాజీ ఎమ్మెల్సీ కొండా మురళీధర్‌రావు అన్నారు. సోమవారం హనుమకొండలోని హరితహోటల్‌లో వరంగల్ తూర్పు నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ముఖ్య కార్యకర్తల సమావేశం జరిగింది. ఈ సమావేశానికి ముఖ్య అతిథిగా వరంగల్ పార్లమెంట్ ఇన్‌చార్జ్ రవీంద్ర ఉత్తమ్‌రావు ధాల్వి పాల్గొన్నారు. ఈసందర్భంగా కొండా మురళీ మాట్లాడుతూ రాష్ట్రవ్యాప్తంగా కాంగ్రెస్ జోరులో ఉందని అధికారంలోకి రావడం ఖాయమైందన్నారు. కేసీఆర్‌కు ఎన్నికలు వచ్చినప్పుడే పథకాలు గుర్తుకు వస్తాయని, తొమ్మిదేళ్లు ఫామ్ హౌస్‌లో నిద్రపోయి ఎన్నికలు రాగానే హడావుడి చేసి ప్రజలను మోసం చేయాలని చూస్తున్నారని అన్నారు. తూర్పు నియోజకవర్గంలో అభివృద్ధి అంటే కేవలం కొండా సురేఖ ఎమ్మెల్యేగా ఉన్నప్పు డు మాత్రమే అని అన్నారు. వచ్చే ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థిగా కొండా సురేఖ పోటీ చేస్తున్నారని తెలిపారు. నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

యోగాతోనే సంపూర్ణ ఆరోగ్యం

మామునూరు : యోగా ఆసనాలతో ఆరోగ్యవంతమైన జీవనం, సుఖసంతోషాలు, మానసిక ప్రశాంతతను అందిస్తాయని, ప్రతి కేడెట్ యోగా ఆసనాలను వేయాలని ప్రముఖ యోగా శిక్షణ నిపుణుడు సత్తయ్య సూచించారు. ఖిలావరంగల్ మండలం మామునూరులోని పోలీసుశిక్షణ కళాశాల ప్రాంగణంలో ఎన్‌సీసీ 10వ వరంగల్ బెటాలియన్ కమాండెంట్ కల్నల్ అజయ్ నంద ఖందూరి ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఎన్‌సీసీ కేడెట్ల శిక్షణ శిబిరం సోమవారం నాలుగో రోజుకు చేరుకుంది. ముఖ్యఅతిథిగా ఆయన హాజరై ఎన్‌సీసీ శిక్షణ క్యాంప్‌ను సందర్శించారు. అనంతరం వ్యక్తిత్వ వికాసం అంశంపై మోటివేషన్ స్పీకర్ డాక్టర్ ఆచార్య రవికుమార్ వివరించారు. కార్యక్రమంలో సదానందం, సుహాస్తదం, రాధాకృష్ణ, రాజయ్య, వెంకటేష్, అనిల్, జీవన్, వివ, రాజమణిక్యం, సృజన, అనితలత, సౌరస్య సతీష్, సందీప్, ఖదం, శ్రీనివాస్ నారాయణరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

దళితులకు 'డబుల్ ఇళ్లు' కేటాయించాలి



కలెక్టరేట్ ఎదుట నిరసన తెలుపుతున్న సీపీఎం నాయకులు

హన్మకొండ అర్బన్ : డబుల్‌బెడ్ రూమ్ ఇళ్లలో దళితులకు న్యాయం చేయాలని సీపీఎం జిల్లా కార్యదర్శి బొట్ల చక్రపాణి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సీపీఎం కాజీపేట మండల కమిటీ ఆధ్వర్యంలో న్యూశాయంపేట దళితులతో కలిసి సోమవారం కలెక్టరేట్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించి, అనంతరం అదనపు కలెక్టర్‌కు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా చక్రపాణి మాట్లాడుతూ అనేక ఏళ్లుగా సాగు చేసుకుంటున్న దళితుల భూమిని వారికి ఎలాంటి నోటీసులు ఇవ్వకుండా, అక్రమంగా అరెస్టు చేసి నిర్బంధించి రాష్ట్ర ప్రభుత్వం శంకుస్థాపనలు చేసిందన్నారు. కార్యక్రమంలో సీపీఎం మండల నాయకులు తొట్టె మల్లేశం, ఓరుగంటి సాంబయ్య, జంపాల రమేష్, వస్కుల మల్లేశం, బద్రీ, అశోక్, శివ, దయాకర్, మూర్తి, బాబు, కృష్ణమూర్తి పాల్గొన్నారు.

తూర్పులో అవకాశం ఇవ్వండి

వరంగల్: వరంగల్ తూర్పు నియోజకవర్గంలో బీజేపీ నుంచి పోటీ చేసేందుకు తనకు అవకాశం కల్పించాలని రాష్ట్ర పార్టీ అధ్యక్షుడు, కేంద్ర మంత్రి జి.కిషన్‌రెడ్డిని న్యాయవాది అల్లం నాగరాజు అభ్యర్థించారు. సోమవారం హైదరాబాద్‌లో రాష్ట్ర ప్రధాన ఎన్నికల కార్యనిర్వహక కమిటీ, కార్యవర్గాన్ని కలిసి తన అభ్యర్థిత్వ దరఖాస్తును అందజేశారు. వరంగల్ తూర్పులో కాషాయ జెండా ఎగురవేసి పార్టీ సత్తా చూపుతానన్నారు.

ఎమ్మెల్యే అభ్యర్థికి దరఖాస్తు

ఖిలా వరంగల్: వరంగల్ తూర్పు నియోజకవర్గం బీజేపీ ఎమ్మెల్యే అభ్యర్థిగా పోటీ చేసే అవకాశం ఇవ్వాలని ఆ పార్టీ యువనేత గంట రవికుమార్ దరఖాస్తు చేసుకున్నారు. సోమవారం హైదరాబాద్‌లోని బీజేపీ కార్యాలయంలో పార్టీ ప్రధాన కార్యదర్శి గుజ్జుల ప్రేమేందర్‌రెడ్డిని కలిసి దరఖాస్తు అందజేశారు. పార్టీ తనకు పోటీ చేసే అవకాశం ఇస్తుందని ఆయన ఆశాభావం వ్యక్తం చేశారు.

శ్మశాన వాటిక భూమి ఇప్పించాలి

- సీపీ రంగనాథ్‌ను కలిసిన తరాలపల్లి వాసులు



సీపీకి ఫిర్యాదు చేస్తున్న తరాలపల్లి ఎస్సీ కులస్తులు

కాజీపేట అర్బన్ : గ్రేటర్ వరంగల్ 45వ డివిజన్ పరిధి తరాలపల్లిలోని ఎస్సీ శ్మశాన వాటిక భూమి ఆక్రమణకు గురికాకుండా తమకు ఇప్పించాలని గ్రామస్తులు సీపీ ఏవీ రంగనాథ్, కాజీపేట ఏసీపీ డేవిడ్‌రాజ్‌లను సోమవారం కలిసి ఫిర్యాదు చేశారు. ఎస్సీల కథనం ప్రకారం... గ్రామంలో ఎస్సీ మాదిగ కుల పెద్దలు గతంలో 38 గుంటల భూమిని శ్మశాన వాటిక నిమిత్తం కొనుగోలు చేయగా స్థానికుడు కోరబోయిన కనకయ్య, తన కుమారుడు రాజులు భూమిని ఆక్రమించారని, ప్రస్తుతం 38 గుంటల బదులుగా 24 గుంటలు మాత్రమే ఉందని తెలిపారు. ఆక్రమణకు పాల్పడిన వారిపై చర్యలు తీసుకుని శ్మశానవాటిక భూమిని అప్పగించాలని వేడుకున్నట్లు తెలిపారు. సానుకూలంగా సీపీ, ఏసీపీ స్పందించి చర్యలు తీసుకుంటామని తెలిపినట్లు తెలిపారు. సీపీ, ఏసీపీని కలిసిన వారిలో ఎర్ర వెంకటయ్య, అరూరి రంజిత్, ఏలుపుకొండ సాంబయ్య, అరూరి రాంబాబు, సింగారపు నాగరాజు, గణేష్, ము నిగాల అజయ్, పాపయ్య, కృష్ణంరాజు, మైసయ్య, సంతోష తదితరులు ఉన్నారు.

కార్యకర్తల కాళ్లకు ముళ్లు గుచ్చుకుంటే పంటితో తీస్తా..

- ఎమ్మెల్యే అరూరి రమేశ్



హసన్‌పర్తి : గులాబీ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానిస్తున్న ఎమ్మెల్యే రమేశ్

హసన్‌పర్తి: కార్యకర్తల కాళ్లకు ముళ్లు గుచ్చుకుంటే...పంటితో తీస్తానని వర్ధన్నపేట ఎమ్మెల్యే అరూరి రమేశ్ అన్నారు. నగరంలోని 2వ డివిజన్ గుండ్లసింగా రానికి చెందిన బీజేపీ, కాంగ్రెస్‌కు చెందిన నాయకులు, కార్యకర్తలు భారీ సంఖ్యలో బీఆర్ఎస్‌లో చేరా రు. ఈ సందర్భంగా వారికి ఎమ్మెల్యే కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ కల్పన, మాజీ మార్కెట్ కమిటీ డైరెక్టర్ గనిపాక విజయ్‌కుమార్ పాల్గొన్నారు.

ఆలయంలో పూజలు

కరీమాబాద్ : గ్రేటర్ వరంగల్ పరిధిలోని 43వ డివిజన్ మామునూరు కుమ్మరిపల్లిలోని పోచమ్మతల్లి దేవాలయంలో సోమవారం వర్ధన్నపేట ఎమ్మెల్యే అరూరి రమేష్ పూజలు నిర్వహించారు. పోచమ్మతల్లి దేవాలయ ప్రతిష్ఠాపన మహోత్సవం సందర్భంగా పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో కార్పొరేటర్ ఈదురు అరుణ విక్టర్, పాల్గొన్నారు.

ఎస్సార్ విద్యార్థినికి అరుదైన అవకాశం



కృష్ణవేణి

హసన్‌పర్తి: ఎస్సార్ విద్యార్థిని అరుదైన అవకాశాన్ని దక్కించుకుంది. ఎస్సార్ యూనివర్సిటీలో బీటెక్ ఫైనలి యర్ చదువుతున్న కృష్ణవేణి రూ.34.40 లక్షల వార్షిక ప్యాకేజీతో ఉద్యోగం సాధించింది. ఆన్‌లైన్ చెల్లింపుల్లో గ్లోబ్‌లీడర్ అయిన 'పే పాల్'లో ఆమెకు కొలువు లభించింది. ఈ సందర్భంగా ఎస్సార్ యూనివర్సిటీ చాన్స్‌లర్ ఎ.వరదారెడ్డి, వైస్ చాన్స్‌లర్ ప్రొఫెసర్ దీపక్ గార్గ్‌లు అభినందించారు. అనంతరం వారు మాట్లాడుతూ కృష్ణవేణి సాధించిన ఘనత ఆమె వ్యక్తిగత విజయాన్ని ప్రతిభింబించడమే కాకుండా ఎస్సార్ యూనివర్సిటీ కమ్యూనిటీ శ్రేష్టత, అంకితభావానికి నిదర్శనమన్నారు.

సంక్షిప్త వార్తలు

స్వర్ణకారుల నిరాహార దీక్ష

వరంగల్ చౌరస్తా : స్వర్ణకారుల ప్రధాన డిమాండ్లను పరిష్కరించాలని సోమవారం వరంగల్ విశ్వకర్మ వీధిలోని ప్రొఫెసర్ జయశంకర్ విగ్రహం ఎదుట గ్రేటర్ స్వర్ణకారుల సంఘం ఆధ్వర్యంలో నిరాహార దీక్ష చేపట్టారు. దీక్షలో సూరోజు రమేష్‌బాబు, కట్టా రాజేందర్, వుప్పల మోహనచారి, శ్రీ రామోజు కిషోర్, పాల్గొన్నారు.

బీజేపీ సంఘీభావం

స్వర్ణకారుల సంఘం నాయకులు నిరాహార దీక్షకు బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు ఎర్రబెల్లి ప్రదీప్‌రావు సంఘీభావం తెలిపారు.

గణితశాస్త్ర గ్రంథం ఆవిష్కరణ

విద్యారణ్యపురి: హనుమకొండకు చెందిన డాక్టర్ అడ్లూరి నర్సింహామూర్తి తన డాక్టరేట్ సిద్ధాంత గ్రంథాన్ని పుస్తకరూపంలోకి తీసుకొచ్చిన గణిత శాస్త్ర గ్రంథాన్ని రిటైర్డ్ డీఈఓ డాక్టర్ వారణాసి వెంకట గురునాథశర్మ ఆవిష్కరించారు. సోమవారం పరిమళ కాలనీలో సిగ్నేచర్ ప్లేస్ అపార్ట్‌మెంటులో ఈ గ్రంథావిష్కరణ కార్యక్రమాన్ని నిర్వహించారు. ప్రముఖ విద్యావేత్త, పారిశ్రామికవేత్త డాక్టర్ గుజ్జారి శ్రీధర్‌బాబు ఆ గ్రంథాన్ని స్వీకరించారు. ఈ సందర్భంగా గురునాథశర్మ అధ్యక్షత వహించగా రామేశ్వరరాజు మాట్లాడుతూ రిటైర్డ్ అయ్యాక కూడా తన పరిశోధన కొనసాగించిన నర్సింహామూర్తి ప్రయోగశీలి అని అభివర్ణించారు.

భ్రమరాంబకు కళాభూషణ్ అవార్డు

హన్మకొండ: కూచిపూడి, భరతనాట్యం, జానపద పాటలతో నృత్యాలు నేర్పిన నృత్య గురువు భ్రమరాంబకు మదర్ ఫౌండేషన్ కళా భూషణ్ అవార్డు అందించి సత్కరించింది. సోమవారం హనుమకొండ సుబేదారిలో జరిగిన కార్యక్రమంలో కుడా మాజీ చైర్మన్ యాదవరెడ్డి భ్రమరాంబకు అవార్డును ప్రదానం చేసి శాలువా కప్పి సన్మానించారు.

నైపుణ్యాలు పెంపొందించుకోవాలి

కేయూ క్యాంపస్: ఇంజనీరింగ్ విద్యార్థులు ప్రస్తుత పోటీ ప్రపంచంలో విస్తృతంగా వస్తున్న మార్పులకు అనుగుణంగా తమలోని నైపుణ్యాలను పెంపొందించుకోవాలని కేయూ ఎస్‌ఈపీ సెల్ డైరెక్టర్, అడ్జెంట్ ఆచార్యులు పి.కృష్ణమాచార్య కోరారు. సోమవారం యూనివర్సిటీలోని మహిళా ఇంజనీరింగ్ కళాశాలలో నూతన విద్యార్థుల ఇండక్షన్ కార్యక్రమంలో విద్యార్థులనుద్దేశించి మాట్లాడారు.

హామీలను తుంగలో తొక్కిన ప్రభుత్వాలు

కరీమాబాద్: గత ఎన్నికల్లో ఇచ్చిన హామీలను తుంగలో తొక్కిన కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు మళ్లీ ఇప్పుడు కూడా ఎన్నికల జిమ్మిక్కులకు పాల్పడుతున్నాయని ప్రజాసంఘాల నాయకులు ఆరోపించారు. వరంగల్ కలెక్టరేట్ ఎదుట తెలంగాణ ప్రజాసంఘాల పోరాట వేదిక ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. వివిధ డిమాండ్లతో కూడిన వినతిపత్రంను అడిషనల్ కలెక్టర్ శ్రీవత్సకు అందజేశారు.

అంధ విద్యార్థికి హ్యాండ్‌స్టిక్ పంపిణీ

హన్మకొండ అర్బన్ : ప్రపంచ తెలుగు సమాచార సాంకేతిక మండలి (డబ్ల్యూటీఐటీసీ) ఆధ్వర్యంలో సోమవారం హైదరాబాద్‌లో జరిగిన సమావేశంలో తెలంగాణ ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ అసోసియేషన్ (టీటా) సహకారంతో సామాజికవేత్త ఈ.వీ శ్రీనివాస్‌రావు కంటి చూపులేని విద్యార్థికి హ్యాండ్ స్టిక్ పరికరాన్ని అందజేశారు.

రైలుకింద పడి యువకుడి ఆత్మహత్య

కాశిబుగ్గ : రైలు కింద పడి గుర్తు తెలియని యువకుడు ఆత్మహత్య జరిగన ఘటన వరంగల్ రైల్వేస్టేషన్ డౌన్ మెయిన్‌లైన్‌లో సోమవారం చోటుచేసుకుంది. మృతుడు సుమారు 20 నుండి 25 ఏళ్ల మధ్య వయస్సు కలిగి బ్లూ కలర్ జీన్స్ ప్యాంటు, యాష్ కలర్‌షర్టు, బ్లాక్ కలర్ చెప్పల్ ధరించి ఉన్నాడన్నారు. మృతుడి గురించి ఎవరికైనా తెలిస్తే స్టేషన్‌లోని జీఆర్పీ స్టేషన్‌లోగాని 9440604320, 8712658585 నంబర్‌లలో సంప్రదించాలని తెలిపారు. డిప్యూటీ ఎస్ఎస్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి మృతదేహన్ని ఎంజీఎం మార్చురీలో భద్రపరచామని జీఆర్పీ హెడ్ కానిస్టేబుల్ సాయి ప్రసాద్ తెలిపారు.

బెల్ట్‌షాపుపై దాడి

ఖిలా వరంగల్: శాంతిభద్రతల పరిరక్షణలో భాగంగా అనధికార మద్యం బెల్టు షాపులపై ఉక్కుపాదం మోపుతామని మిల్స్‌కాలనీ ఇన్‌స్పెక్టర్ టి.సురేష్ అన్నారు. అక్రమంగా మద్యం నిల్వ చేసి విక్రయిస్తే చట్టపరంగా శిక్షిస్తామని హెచ్చరించారు. సోమవారం రాత్రి సాకరాసికుంటలో అనధికార బెల్ట్ షాపుపై సీఐ సురేష్ ఆకస్మికంగా దాడి చేసి రూ. 13వేల విలువైన మద్యాన్ని సీజ్ చేశారు.

తప్పిపోయిన వృద్ధురాలు

రామన్నపేట : తన భర్త బాలమల్లుతో శనివారం ఎంజీఎం ఆస్పత్రికి చికిత్స నిమిత్తం వచ్చిన 63 ఏళ్ల వృద్ధురాలు తప్పిపోయినట్లు మట్టెవాడ ఇన్‌స్పెక్టర్ వెంకటేశ్వర్లు తెలిపారు. ఎంజీఎం 2వ గేటు సదరు వృద్ధురాలు తప్పిపోయిందని ఆచూకీ తెలిసిన వారు 8712685005, 8712584607 నంబర్లకు సమాచారం అందించ గలరని తెలిపారు.

ప్రైవేట్ టీచర్లకు ఇళ్లు నిర్మించాలి

విద్యారణ్యపురి: పేదలకు, మధ్య తరగతికి చెందిన ప్రైవేట్ ఉపాధ్యాయులకు, నగరంలో అపార్ట్‌మెంట్లుగా ఇళ్లు నిర్మించి ఇవ్వాలని ప్రభుత్వ చీఫ్ విప్ దాస్యం వినయ భాస్కర్‌ను, కుడా చైర్మన్ సంగంరెడ్డి సుందర్ రాజ్ యాదవ్ కోరగా స్పందించి హైదరాబాద్‌లో సెక్రటేరియేట్‌లో మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్ స్పెషల్ చీఫ్ సెక్రటరీ అరవిందకుమార్‌ను కలిసి వినతిపత్రంను సమర్పించినట్లు వడుప్సా హనుమకొండ జిల్లా అధ్యక్షుడు మాదాల సతీష్ కుమార్ సోమవారం తెలిపారు.

దివ్యాంగుల సంక్షేమమే కేసీఆర్ లక్ష్యం

ఖిలావరంగల్: దివ్యాంగుల సంక్షేమమే సీఎం కేసీఆర్ లక్ష్యమని వరంగల్ తూర్పు ఎమ్మెల్యే నన్నపనేని నరేందర్ అన్నారు. సోమవారం వరంగల్ శాంతినగర్‌లోని రాజశ్రీగార్డెన్‌లో రాష్ట్ర వికలాంగులు, వృద్ధుల సంక్షేమశాఖ ఆధికారులు ఎం. శారద, అరుణ ఆధ్వర్యంలో దివ్యాంగులకు బ్యాటరీ ట్రైసైకిల్స్ అందించటానికి ఆన్‌లైన్ నమోదు కార్యక్రమం ప్రారంభమైంది.

అభివృద్ధి పనులకు శంకుస్థాపన

కరీమాబాద్: గ్రేటర్ పరిధిలోని 40వ డివిజన్ ఉర్సు కరీమాబాద్ కటికవాడలో రూ.40 లక్షలతో చేపట్టనున్న సీసీ రోడ్డు, డ్రెయినేజీ నిర్మాణ పనులకు సోమవారం ఎమ్మెల్యే నన్నపునేని నరేందర్ శంకుస్థాపన చేశారు.

రేషన్‌కార్డులు మంజూరు చేయాలి

హన్మకొండ అర్బన్ : జిల్లాలో అర్హులైన నిరుపేదలకు నూతన ఆహార భద్రత కార్డులను వెంటనే మంజూరు చేయాలని డీవైఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు నోముల కిషోర్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సోమవారం హనుమకొండ తహసీల్దార్ కార్యాలయం ఎదుట నిరసన ధర్నా నిర్వహించి తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేశారు.

పట్టాపాస్ పుస్తకాలు జారీ చేయండి

హసన్‌పర్తి: మండలంలోని భీమారంలోని సర్వే నంబర్ 340, 350లో దళితులకు కేటాయించిన భూములకు పట్టాదార్‌పాస్ పుస్తకాలు జారీ చేయాలని కార్పొరేటర్ జక్కుల రజిత కోరారు. సోమవారం గ్రీవెన్స్‌లో జిల్లా అదనపు కలెక్టర్ మహేందర్‌జీకు వినతిపత్రం అందజేశారు.

పంపిణీకి సిద్ధంగా గొర్రెలు

ఖిలా వరంగల్: కులవృత్తులను బతికించేందుకు తెలంగాణ ప్రభుత్వం గొర్రెల పంపిణీ ప్రతిష్టాత్మకంగా చేపట్టింది. ఈ నేపథ్యంలో మధ్యకోట ఖుషిమహాల్ సమీపంలోని వాకింగ్ గ్రౌండ్‌కు సోమవారం సాయంత్రం డీసీఎం వాహనాల్లో గొర్రెలు చేరుకున్నాయి. వీటిని మంగళవారం సంబంధిత ఆధికారుల ఆధ్వర్యంలో స్థానిక కార్పొరేటర్ బైరబోయిన ఉమయాదవ్, వేల్పుగొండ సువర్ణ నేతృత్వంలో లబ్ధిదారులకు ఎమ్మెల్యే నరేందర్ పంపిణీ చేయనున్నట్లు తెలిసింది.

'ఎమ్మెల్యేల జోక్యం తగదు'

కరీమాబాద్: గొర్రెల పంపిణీలో ఎమ్మెల్యేల జోక్యం లేకుండా డీడీలు తీసిన వారందరికీ గొర్రెలు పంపిణీ చేయాలని డిమాండ్ చేస్తూ సోమవారం గొర్రెలు, మేకల పెంపకదారుల సంఘం ఆధ్వర్యంలో వరంగల్ అడిషనల్ కలెక్టర్ శ్రీవత్సకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా జిల్లా కమిటీ కార్యదర్శి పరికి మధుకర్ మాట్లాడుతూ రెండో విడత గొర్రెల కోసం జిల్లాలో 622 మంది డీడీలు తీసి 12 నెలలుగా ఎదురు చూస్తున్నారని తెలిపారు.

మోదీ పాలనలో దేశం అగ్రగామి

కరీమాబాద్: ప్రధానమంత్రి నరేంద్రమోదీ నేతృత్వంలో భారతదేశం ప్రపంచంలో అన్ని రంగాల్లో అగ్రగామిగా నిలుస్తుందని బీజేపీ రాష్ట్ర నాయకుడు, వరంగల్ అర్బన్ కో ఆపరేటివ్ బ్యాంక్ చైర్మన్ ఎర్రబెల్లి ప్రదీప్‌రావు అన్నారు. గ్రేటర్ వరంగల్ పరిధిలోని 40వ డివిజన్‌లోని పలు పార్టీలకు చెందిన యువకులు, మహిళలు సోమవారం బీజేపీలో చేరగా వారిని పార్టీ కండువాలు కప్పి ఆహ్వానించారు.

వర్ధన్నపేట నుంచి అవకాశం కల్పించాలి



బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు కిషన్ రెడ్డిని కలిసిన జన్ను మధుకర్

హన్మకొండ: వర్ధన్నపేట అసెంబ్లీ నియోజకవర్గం నుంచి బీజేపీ అభ్యర్థిగా పోటీ చేసే అవకాశాన్ని కల్పించాలని బీజేపీ ఎస్సీ మోర్చా హనుమకొండ జిల్లా అధ్యక్షుడు జన్ను మధుకర్ కోరారు. సోమవారం హైదరాబాద్‌లో కేంద్ర పర్యాటక, సాంస్కృతిక శాఖ మంత్రి, బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు జి.కిషన్ రెడ్డిని కలిసి వినతి పత్రం అందించారు. ఆయన వెంట బీజేపీ జిల్లా ఉపాధ్యక్షుడు పాశికంటి రాజేంద్రప్రసాద్, కార్యదర్శి గుండెకారి కోటేశ్వర్ రావు, నాయకులు మహేశ్వర్ గౌడ్, అమృతరావు, హరిబాబు ఉన్నారు.